క్లుప్తంగా

2వేల కేజీల వర్మీకంపోస్ట్ విక్రయం



పెదభోగిలి కేంద్రంలో వర్మీకంపోస్ట్ లోడ్ చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో తయారు చేసిన వర్మీకంపోస్ట్ 2వేల కేజీలు విక్రయించినట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలిపారు. ఈ ఎరువును ప్రకృతి వ్యవసాయం చేస్తున్న జట్టు ఆశ్రమం శుక్రవారం కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు, వర్మీకంపోస్ట్ తయారీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. హెటిరో ల్యాబ్స్, ఫైజర్, రేండ్‌స్టాండ్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాలో 145 మంది పాల్గొనగా 74 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసమూర్తి, జేకేసీ కో ఆర్డినేటర్ రాంబాబు, తదితరులు అభినందించారు.

తామరఖండిలో వైద్య పరీక్షలు



తామరఖండిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా శుక్రవారం తామరఖండి ఎంపీటీసీ వై.గౌరీశ్వరి ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు కార్యదర్శి పద్మావతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్తూ బీపీ, సుగర్, చర్మవ్యాధులు, ఇతరత్రా వ్యాధులున్నాయా లేదో తనిఖీ చేస్తూ, ఉచితవైద్యశిబిరంలో వైద్యసేవలు పొందడానికి కూపన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

బలిజిపేట: మండలంలోని మురగడాంలో 12అడుగుల కొండచిలువను గ్రామస్తులు శుక్రవారం హతం చేశారు. గ్రామానికి చెందిన మింది గంగరాజు పొలంలో మందు స్ప్రే చేస్తుండగా కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి సమీపంలో ఉన్న రైతులను పిలవడంతో అంతా కలిసి కొండచిలువను హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సాలూరు: పట్టణంలోని నవజీవన్ పూర్ చిల్డ్రన్స్ హాస్టల్‌లో పలువురు వితంతువులకు నిత్యావసర సరుకులు అందించారు. నవజీవన్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీధర్ ఆచార్య ఆర్థిక సాయంతో అన్న లక్ష్మీ స్కీమ్ కింద ప్రతి నెలా రెండో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ బ్రాంచ్ మేనేజర్ చిక్కాల చిన్నమ్మలు తెలిపారు. సుమారు 35 మంది వితంతువులకు బియ్యం, నూనె, తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు.

పిల్లలను బడికి పంపండి

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లువాడ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రూపవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో
633 మందికి వైద్యసేవలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 633మందికి వైద్యసేవలు అందించామని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో వైద్య బృందం అన్నిరకాల వైద్య సేవలు అందించారని చెప్పారు. ప్రజలకు వైద్యసేవలు అందించి అవసరమైన వారిని రిఫర్ చేశామని తెలిపారు. వైద్యసేవలు పొందిన వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. వలంటీర్లు, వైద్యశాఖ ఇంటింటి సర్వే చేసి ఇచ్చిన టోకెన్ల ప్రకారం శిబిరానికి వచ్చినవారికి సేవలు అందించినట్లు వివరించారు. ఎంపీపీ నాగమణి, సర్పంచ్ పాపారావులు వైద్యసేవలు పొందేందుకు వచ్చే వారిని సంప్రదించి పూర్తిస్థాయి వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యభద్రత

సీతానగరం: జగనన్న ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను గ్రామాల్లోనే ప్రముఖ వైద్య నిపుణులతో చితంగా అందించడం శుభ పరిణామమని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు నాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని గెడ్డలుప్పి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్.వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా జిల్లా కేంద్రాస్పత్రి జనరల్ జర్జన్ అపర్ణబాల, డెంటిస్ట్ వాసంతి, సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్, డెర్మటాలజీ డాక్టర్ సీతారామాంజనేయులు వైద్యసిబ్బంది వైద్యసేవలు అందించడంతో జగనన్న ఆరోగ్య సురక్షను ఆరోగ్య ప్రదాయినిగా ప్రజలంతదరూ భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గెడ్డలుప్పి,కొత్తవలస సర్పంచ్‌లు అల్లుతిరుపతినాయుడు, రెడ్డి అనిత, ఎంపీటీసీ సత్యనారాయణ, పీఏ సీఎస్ చైర్మన్ కె.శ్రీరాములు, ఐసీడీఎస్ ఎస్ఓ పూర్ణిమ, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్ రామకృష్ణ, బగ్గందొరవలస మాజీ సర్పంచ్ బి.శంకరరావు, సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మోహనరావు, గ్రామవలంటీర్లు, గృహసారథులు, కొత్తవలస వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

450 మందికి వైద్యసేవలు..

ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరంలో దీర్ఘకాలికవ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి గ్రామాల్లో ఉచితవైద్య శిబిరాలద్వారా సేవలందిస్తున్న ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. గెడ్డలుప్పిలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లతో 450 మందికి వైద్య సేవలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందజేస్తున్న విలువైన వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని వెంకంపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న ఆరోగ్య పరీక్షలతో పాటు అక్కడ వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసే మందుల ఏర్పాట్లను పరిశీలించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా అందరికీ చక్కని వైద్యం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూడా తన ఆరోగ్య సమస్యలపై డాక్టర్‌కు చూపించుకుని మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలను చేయించుకుని వైద్యులు సూచించిన మందులను తీసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, చిన్న పిల్లల తల్లిదండ్రులను ప్రత్యేకంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని వారికి పూర్తి సహాయ సహకారాలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవిమార్, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీమవరపు కృష్ణ, తీళ్ల సుభద్ర, మండల నాయకులు, తహశీల్దార్ శివన్నారాయణ, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు



సీతానగరం: వైద్యశిబిరంలో రోగిని తనిఖీ చేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ అపర్ణబాల



సీతానగరం: మందులను పరిశీలిస్తున్న శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జీ

ప్రజల వద్దకే వైద్యసేవలు

- జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కవిరిపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సేవల కోసం ప్రజలెవ్వరూ ఇబ్బందులు పడకుండా ఉండాలన్న సంకల్పంతోనే గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పాచిపెంట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బద్నాన ప్రమీల కోరారు. మండలంలోని కేసలి సచివాలయం పరిధిలో స్థానిక సర్పంచ్ సత్తారపు నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె మాట్లాడుతూ, ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా ఓవైపు ఆదుకుంటూ, మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రిని రానున్న ఎన్నికల్లో మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, వైద్యాధికారులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కవిరిపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

విజయవంతం

సాలూరు: మండలంలోని నార్లవలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్యశిబిరంలో సుమారు 441 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మాట్లాడుతూ, జగనన్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివకుమార్, ఎంపీడీఓ పార్వతి, వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల



సాలూరు: నార్లవలసలో మందులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

చిల్డ్రన్ ప్రేయర్ హాల్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం చర్చి సెంటర్ వద్ద ఉన్న లూథర్ చర్చి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఎస్టీ పాల్స్ చిల్డ్రన్ ప్రేయర్ హాల్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదర భావమే క్రీస్తు సందేశమని ప్రతి ఒక్కరూ సోదర భావాన్ని కలిగి ఉండాలని అన్నారు. చిన్నపిల్లలు విద్యార్థి దశనుంచే ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ బిషప్ ఫ్యారిపాస్టర్ ఆర్డీ రేవ పి.సుదర్శన రావు, పాస్టర్ టి.సుదర్శనరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, మత గురువులు, పెద్దలు, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.



చిల్డ్రన్ ప్రేయర్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జీసీసీలో ఆడిట్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయం ఆవరణలో గల డీఆర్‌ఎస్ గొడౌంతో పాటు ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్, సూపర్‌బజార్, గ్యాస్ గొడాం, పెట్రోల్ బంకులలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (విశాఖపట్నం) పి.ఇందిరా లావణ్య శుక్రవారం అర్థ సంవత్సరం ఆడిట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సెప్టెంబర్ 30 వరకు (ఆరు నెలల్లో) జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, సరుకుల నిల్వలు, రికార్డుల్లో నమోదైన ప్రకారంగా నిల్వలు ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. ఆమె వెంట జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, డీఆర్‌ఎస్ గొడాం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావు, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి భాస్కరరావు ఉన్నారు.



డీఆర్‌ఎస్ గొడాంలో సరుకుల నిల్వలు పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇందిరా లావణ్య

సామూహిక మాలధారణ

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల కొంగు బంగారం పాలకొండ శ్రీ కోటదుర్గమ్మ దేవస్థానంలో భక్తులు సామూహిక మాలధారణ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. మరో రెండు రోజుల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న క్రమంలో భక్తులు అమ్మవారి ఉపాసనకు సిద్ధమయ్యారు. సాంప్రదాయ బద్ధంగా భవాని దీక్షలకు ఉపక్రమించి మాలధారణ చేసారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది.

పకడ్బందీగా దసరా ఉత్సవాలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల నిర్వహణకు పక్కాగా ప్రణాళిక ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలతో పాటు 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కషాయాల వాడకంతో దిగుబడి

బలిజిపేట: ద్రావణాలు, కషాయాల వినియోగం వల్ల చీడపీడల నివారణ జరిగి, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, దిగుబడులు బాగా పెరుగుతాయని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముఖరాజు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని బర్లి, మిర్తివలసలలో ఆయన శుక్రవారం వ్యవసాయ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అందులో భాగంగా బర్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను కలిసి వారినుంచి వివరాలు తెలుసుకుని కొన్ని సూచనలు చేశారు. మిర్తివలసలో బయో ఇన్‌పుట్ సెంటర్‌ను పర్యవేక్షించి ద్రావణాలు, కషాయాలు, నవధాన్యాలు, కాయగూర విత్తనాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. ద్రావణాలు, కషాయాల వాడకం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, దిగుబడులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్, ఎం.టిలు శ్రీరాములు, నరసింహ, సీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతిరావులు పాల్గొన్నారు.



కషాయాల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖ రాజు

ఈ-క్రాప్ తప్పనిసరి

పార్వతీపురంటౌన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలకు సంబంధించి తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి అశోక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని చినమరికి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలు రైతులకు సమకూరుతాయన్నారు. పంట నష్టం వాటిల్లినా, దిగుబడి అమ్మకాలు చేపట్టేటప్పుడు ఈ విధానం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిపై ఆర్‌బీకే సిబ్బంది రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారన్నారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అశోక్

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



మోడల్‌స్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సాలూరు:మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ రవి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం అభినందించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ, విజయనగరం రాజీవ్‌స్టేడియంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్, బేస్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారన్నారు.
బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో పూజిత, లక్ష్మీప్రియ.. బేస్‌బాల్ విభాగంలో హేమలత, మహాలక్ష్మి ఎంపికయ్యారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థినులను ప్రిన్సిపాల్ అంజలీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: చట్టానికి ఎవ్వరూ అతీతులు కారన్న విషయాన్ని టీడీపీ నాయకులు తెలుసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, సాలాపు త్రినాథ, లక్ష్మణరావు, శంకరరావు, తదితరులు అన్నారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా జగన్ మోహన్‌రెడ్డికి బుద్ధి రావాలంటూ ఇటీవల మండలంలోని మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ వినతిపత్రం ఇవ్వడాన్ని వారు ఖండించారు. ఈ మేరకు మామిడిపల్లిలో గల వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో ఆధారాలతో సహా దొరకడం వల్లే చంద్రబాబు అరెస్ట్ అయ్యారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు మేలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధితో సువర్ణ పాలన అందిస్తున్నారని కొనియాడారు. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం జగనన్న పాలనలో సాకారమైందన్నారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని చెప్పారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కొమరాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సహంతో యువతీ, యువకులు కుటీర పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అవగాహన సదుస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా 18 నుండి 50 సంవత్సరాలలోపు ఉండి కనీసం 8వ తరగతి పాసైతే బ్యాంకు నుండి ఋణాలు ఇస్తారన్నారు. గ్రామీణ ప్రాంతంలో మహిళలకు 35 శాతం, పురుషులకు 30శాతం సబ్సిడీ అందజేస్తారని, బ్యాంకు నుండి తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే పూర్తి బ్యాంకు సబ్సిడీ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ బి.చక్రధర్, వివిధ శాఖల అధికారులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

బకాయి జీతాలు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం: గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నెల వరకు బకాయిపడిన వేతనాలను తక్షణమే చెల్లించాలని మండలంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చెత్త తరలించే రిక్షాలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షుడు మండంగి పైడయ్య, సీఐటీయూ నాయకుడు కె.గౌరీశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలు చెత్త రహిత గ్రామాలుగా ప్రతీ రోజూ తీర్చిదిద్దుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు ఏడాది పాటు జీతాలు ఇవ్వకుండా బకాయి ఉంచడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని, రూ.10వేలకు వేతనం పెంచాలని, మాస్కులు, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు.